కాలనీల్లో నీటి కష్టాలు



హస్తినాపురంలో జలమండలి ట్యాంకర్ ద్వారా నీటిని పోయించుకుంటున్న అపార్ట్‌మెంట్‌వాసులు

• అడుగంటుతున్న బోరుబావులు • లో ప్రెషర్‌తో జలమండలి నీటి సరఫరా

వనస్థలిపురం: ఎండలు ముదురుతున్న నేపథ్యంలో నీటి కష్టాలు మొదలవుతున్నాయి. కాలనీల్లో బహుళ అంతస్తుల భవనాలు, అపార్ట్‌మెంట్లు భారీగా వెలుస్తుండడంతో నీటి వాడకం పెరిగి బోరు బావులు అడుగంటుతున్నాయి. జలమండలి నీటి సరఫరాలో కూడా ప్రెషర్ తగ్గడంతో సరిపడా నీరు అందక కాలనీల ప్రజలు జలమండలి, ప్రైవేటు నీటి ట్యాంకర్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంటోంది. మార్చిలోనే ఇలా ఉంటే ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందోనని ప్రజలు వాపోతున్నారు.

విచ్చలవిడిగా బోర్ల తవ్వకాలు

వనస్థలిపురం, బీఎన్‌రెడ్డినగర్, హస్తినాపురం, హయత్‌నగర్, మన్సూరాబాద్, నాగోలు తదితర డివిజన్లలో బహుళ అంతస్తుల భవనాలు, అపార్ట్‌మెంట్లు, వాణిజ్య భవనాలు శరవేగంగా రూపుదిద్దుకుంటున్నాయి. దీంతో సహజంగానే నీటి వాడకం ఎక్కువవుతోంది. దీంతో విచ్చలవిడిగా బోరు బావుల తవ్వకాలు సాగుతున్నాయి. బడా నిర్మాణ సంస్థలు తమ భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని 1500 నుంచి 2000 కు పైచిలుకు ఫీట్ల లోతుగా బోరు బావులను తవ్వి భూగర్భ జలాలను తోడేస్తున్నారు. దీంతో కాలనీలలో మామూలు లోతులో ఉన్న బోరు బావులు ఎండిపోతున్నాయి.



సామనగర్‌లో ఓ వ్యవసాయ బోరు వద్ద ప్రైవేట్ ట్యాంకర్లకు నీటిని నింపుతున్న దృశ్యం

వాల్టా చట్టం అమలెక్కడా?

కొత్తగా వ్యక్తిగత బోర్లు, బావుల తవ్వకాలపై ఆంక్షలు వర్తిస్తాయి. భూగర్భ జలాల పరిరక్షణకు వాల్టా (వాటర్, ల్యాండ్ అండ్ ట్రీస్ యాక్ట్) చట్టం అమలులో ఉంది. బోరు వేయడానికి 15 రోజుల ముందు సంబంధిత యజమాని భూగర్భ జలవనరుల అధికారులకు సమాచారం ఇచ్చి వారి నుంచి అనుమతి పొందాలి. బోర్‌వెల్ తవ్వకం యంత్రాలు కలిగి ఉన్న నిర్వాహకులు విధిగా తమ పేర్లను సంబంధిత అధికారుల వద్ద నమోదు చేసుకుని తవ్వకాలకు అనుమతి తీసుకోవాలి. కానీ ఇవేమి లేకుండా కాలనీల్లో రాత్రీపగలు తేడా లేకుండా బోరు బావులను తవ్వేస్తున్నారు.

రూ. వెయ్యి వెచ్చించాల్సిందే..

కాలనీలలో జలమండలి రోజు విడిచి రోజు నీటి సరఫరా చేస్తోంది. ఇంతకు ముందు రెండు గంటల పాటు సరఫరా ఉండగా, ప్రస్తుతం ఆ సమయం తగ్గిపోతోంది. దీనికితోడు పలు ప్రాంతాలలో లోప్రెషర్‌తో సరఫరా జరుగుతుండడంతో సరిపోయే నీరు రావడం లేదని కాలనీల ప్రజలు వాపోతున్నారు.

ఉన్న బోర్లు అడుగంటిపోవడంతో గత్యంతరంలేక జలమండలి, ప్రైవేట్ ట్యాంకర్లను ఆశ్రయిస్తున్నారు. జలమండలి వారు 5000 లీటర్ల సామర్థ్యం గల ట్యాంకర్‌ను క్యాన్ నెంబర్ ఉన్నవారికి రూ. 500కు, వాణిజ్య అవసరాలకు రూ. 850 చొప్పున వసూలు చేస్తున్నారు. ఇక ప్రైవేటుకు చెందిన బోరు వాటర్ ట్యాంకర్లను రూ. 650 మొదలుకొని రూ. 1000 వరకు వెచ్చించి నీటిని కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది.

నీటి పొదుపే మేలు...

నీటి ఎద్దడి నివారణకు ఉన్న జలాలను పొదుపుగా వాడుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. భూగర్భ జల రక్షణకు ప్రతి ఒక్కరు తమ ఇల్లు, పరిసరాలలో ఇంకుడుగుంతలు ఏర్పాటు చేసుకోవాలని అధికారులు, పలు సంస్థలు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. కాగా జలమండలి ఆధ్వర్యంలో నీటి సరఫరా చేసే సమయంలో పలు ప్రాంతాలలో లీకేజీలతో విలువైన నీరు వృథాగా రోడ్లపాలు అవుతోందని, లీకేజీలను అరికట్టడానికి జలమండలి తగిన చర్యలు తీసుకోవాలని, అలాగే లోప్రెషర్ సమస్యను అరికట్టాలని కాలనీలప్రజలు కోరుతున్నారు.

పేద ప్రజలకు అండగా ఉంటాం

నాగోలు: భారత కమ్యూనిస్టుపార్టీ(సీపీఐ) పేద ప్రజలకు అండగా ఉంటుందని ఆ పార్టీ మేడ్చల్ జిల్లా సమితి సభ్యులు బొడ్డుపల్లి కృష్ణ అన్నారు. కొత్తపేట డివిజన్‌లోని న్యూనాగోల్ లోని ఎస్‌కే డాంగే భవన్‌లో కొత్తపేట డివిజన్, మోహన్ నగర్ శాఖ పార్టీ సభ్యులకు నూతన సభ్యత్వ కార్డులను శాఖ కార్యదర్శి ఉడుతల మల్లేష్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి తరాన్ని చైతన్యం చేస్తూ మతతత్వం, అవినీతి, శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా, సమాన పనికి సమాన వేతనం కోసం అన్ని వర్గాలను చైతన్య పరుస్తూ ముందుకు సాగుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయులు, బరిగేలా కృష్ణ, సుగుణ, రవి, హైమద్, మధు,జగన్ పాల్గొన్నారు.

జెడ్సీకి కార్పొరేటర్ వినతి

నాగోలు: కొత్తపేట్ డివిజన్ పరిధిలోని కాలనీల్లో రోడ్లు ధ్వంసం కావడంతో నడవలేని దుస్థితి నెలకొందని నూతన సీసీ రోడ్లు మంజూరు చేయాలని గురువారం కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో బాక్స్ డ్రైనేజ్ ఏర్పాటు చేయించాలని వర్షాకాలంలో భారీ ఎత్తున వరదలు సంభవించడంతో కాలనీల్లో ఇబ్బందికరంగా మారుతుందని వివరించారు. నిధులు మంజూరు చేస్తే వివిధ సమస్యలు పరిష్కారం అవుతాయని వినతిలో కోరారు.

మెరుగైన వసతులు కల్పిస్తాం



పార్కును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: ప్రజలకు మెరుగైన వసతుల కల్పనకు నిరంతరం కృషిచేస్తానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ ఫేజ్-3 హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో నిర్మించిన థీమ్‌పార్కును గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. దాదాపు ఎకరం స్థలంలో అద్భుతంగా థీమ్‌పార్కు నిర్మించామని అందులో బుద్ధుడి విగ్రహం, యోగా చేసుకోవడానికి స్థలం, చిల్డ్రన్ ప్లే పార్క్, వాకింగ్ ట్రాక్, గార్డెన్‌ను నిర్మించడం జరిగిందన్నారు. త్వరలోనే ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తామన్నారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు మధుయాష్కీ అధికారులపై ఒత్తిడి తెచ్చి కావాలని పార్కును ప్రారంభించకుండా చేస్తున్నారని ప్రజలను ఇబ్బందులు పెట్టే కార్యక్రమాలను మానుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అరవింద్‌రెడ్డి, అనిల్‌చౌదరి, సుమన్‌గౌడ్,సతీష్‌కుమార్, రాఘవేందర్ రావు, కృష్ణ పాల్గొన్నారు.

ఉత్సాహంగా 5కే వాకథాన్



వాకథాన్‌లో పాల్గొన్న రాజశేఖర్‌రెడ్డి, వైద్యులు

లింగోజిగూడ: కిడ్నీ సంబంధిత వ్యాధుల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా గురువారం ఎల్‌బీనగర్ బైరామల్‌గూడలోని గ్లెనిగర్ అవేర్ ఆసుపత్రి సీఓఓ కరుణాకర్ రెడ్డి ఆధ్వర్యంలో 5కే వాకథాన్ నిర్వహించారు.అనంతరం కిడ్నీ వ్యాధుల పట్ల స్థానికులకు అవగాహన కలిపించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. వ్యాధులు ముదిరిన తర్వాత ఆసుపత్రుల చుట్టూ తిరుగడం కన్నా ముందస్తు చర్యలతో నివారించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు నవీన్ పూల, ప్రభుచరణ్ తదితరులు పాల్గొన్నారు.

పార్కు స్థలం పరిశీలన



పార్కు స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మన్సూరాబాద్: హయత్‌నగర్ మండల పరిధి సర్వే నెంబర్ 186 శివగంగకాలనీలోని పార్కు స్థలం కబ్జా అయ్యిందని కాలనీవాసుల ఫిర్యాదు మేరకు హైడ్రా అధికారి బాచిరెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు తొంటబాబు మాట్లాడుతూ.. కాలనీ పార్కు స్థలం కబ్జా అవుతుందని గతేడాదిగా జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని, అంతే కాక కబ్జాదారుడికి భవన నిర్మాణానికి అనుమతులిచ్చారని తెలిపారు. ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్, హయత్‌నగర్ డిప్యూటీ కమిషనర్, హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేసినా స్పందన లేదన్నారు. గత నెల15న హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కలిసి ఫిర్యాదు చేయగా హైడ్రా అధికారి క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చారని వివరించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు నకిరేకంటి వెంకటేష్‌గౌడ్, సతీష్‌రెడ్డి, నర్సింహ్మాయాదవ్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు

టమాటా రూ.11, వంకాయ రూ.23, బెండ రూ.50, పచ్చిమిర్చి రూ.35, కాకరకాయ రూ.45, బీరకాయ రూ.45, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.08, క్యారెట్ రూ.15, దొండ రూ.45, ఆలుగడ్డ రూ.20, ఉల్లిగడ్డ రూ.24, గోకరకాయ రూ.35, దోసకాయ రూ.21, సొరకాయ రూ.11, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.55, చామగడ్డ రూ.45, మునగ రూ.45, కందగడ్డ రూ.70, బీట్‌రూట్ రూ.13, కీర రూ.18, బీన్స్ రూ.45, క్యాప్సికమ్ రూ.28. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న కోట్ల శ్రీనివాస్

సైదాబాద్: పవిత్ర రంజాన్ మాసంలో కులమతాలకు అతీతంగా నిర్వహించే ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీకలుగా నిలుస్తాయని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ అన్నారు. గురువారం సాయంత్రం ఐఎస్‌సదన్‌లో నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇఫ్తార్ విందులు ప్రజల మధ్య ఐక్యతను పెంచడానికి దోహదపడుతాయన్నారు. హిందూ ముస్లింలు సోదరభావంతో మెలగడం పాతబస్తీ గొప్పతనం అన్నారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ ఫిరోజ్, ఘని, పలువురు ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

అసోసియేషన్ కార్యాలయం ప్రారంభం



కార్యాలయం ప్రారంభిస్తున్న శాంతకుమార్, అబ్రాహం

మలక్‌పేట: సమస్యల పరిష్కారానికి క్రైస్తవులంతా ప్రేమ, ఐక్యతతో ముందుకు సాగాలని మలక్‌పేట నియోజకవర్గ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రోళ్ల మాణిక్యం అబ్రాహం అన్నారు. గురువారం మూసారంబాగ్‌లోని ఆర్‌ఆర్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన అసోసియేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. యేసుక్రీస్తు చూపిన మార్గాన్ని అనుసరిస్తూ నడుచుకోవాలన్నారు. క్రైస్తవుల సంక్షేమ కోసం ప్రభుత్వ ప్రవేశపెట్టిన ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దిల్‌సుఖ్‌నగర్ బాప్టిస్టు చర్చి పాస్టర్ శాంత కుమార్, ఈస్ట్‌ప్రశాంత్‌నగర్ మిస్పా చర్చి పాస్టర్ ప్రశాంత్‌కుమార్ ప్రత్యేక ప్రార్థనలు చేసి నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సమావేశంలో అనితా షిబారాణి, నవీనకుమార్ గౌడ్, జరూసలేం మత్తయ్య, ఇర్మియా, క్రిస్టోఫర్, యేసురత్నం, మోజెస్, ధన్‌రాజ్, ఆనంద్, ఈఎం పాల్‌రాజ్ పాల్గొన్నారు.

అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా?



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

మన్సూరాబాద్: మన్సూరాబాద్‌లో 95 శాతం అభివృద్ధి నిధులను ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మంజూరు చేయించారని, దీనిపై బహిరంగ చర్చకు సిద్ధమా? అని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డికి మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, టంగుటూరి నాగరాజు సవాల్ చేశారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇంజినీరింగ్ అధికారులు ప్రొటోకాల్ ప్రకారం మీకు సమాచారం ఇచ్చారని, కార్యక్రమానికి హాజరవుతున్నట్లు అధికారులకు చెప్పి తీరా గైర్హజరై ప్రొటోకాల్ పాటించడం లేదనడం సబబు కాదన్నారు. అవాస్తవాలు, అబద్దాలు చెప్పి ఇంకా ఎంత కాలం పబ్బం గడుపుకుంటారని ప్రశ్నించారు. ప్రజల ఆకాంక్షల మేరకు ప్రజాస్వామ్యంలో కలిసి పనిచేయాలని, దిగజారుడు రాజకీయాలు చేయవద్దని హితువు పలికారు.ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిపై ఆరోపణలు చేసే నైతిక హక్కు లేదన్నారు. ఈ సమావేశంలో జగదీష్‌యాదవ్, రఘువీర్‌రెడ్డి, రుద్ర యాదగిరి, నర్రి వెంకన్న, నర్సింగ్‌గౌడ్, చంద్ర మోహన్ పాల్గొన్నారు.

గుజరాత్ టు హైదరాబాద్



నకిలీ నోట్లతో పట్టుబడ్డ నిందితులు

నకిలీ కరెన్సీ, బంగారం చెలామణి చేస్తున్న ముఠా రిమాండ్

నాగోలు: నకిలీ కరెన్సీ, బంగారంతో ప్రజలను మోసం చేస్తున్న ఓ ముఠాను ఎల్‌బీనగర్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. సీఐ వినోద్‌కుమార్ వివరాల ప్రకారం..కూకట్‌పల్లి నిజాంపేట, లేక్‌వ్యూ కాలనీ చెందిన చిన్నోళ్ల మాణిక్యరెడ్డి(49) అదే ప్రాంతంలో వ్యాపారం చేసేవాడు. గతంలో అతని భార్య గుండెపోటుతో మరణించింది. వ్యాపారంలో నష్టపోవడంతో సులభంగా డబ్బులు సంపాదించేందుకు ఆన్‌లైన్‌లో వివిధ మార్గాలను శోధించాడు. ఈ క్రమంలో గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఉండే సురేష్ అలియాస్ సురేష్ భాయ్ అనే వ్యక్తిని సంప్రదించాడు. తనకు నకిలీ కరెన్సీ అవసరాన్ని వివరించాడు. జనవరిలో మణిక్యరెడ్డి అహ్మదాబద్‌కు వెళ్లి సురేష్‌ను కలిసి రూ.లక్ష చెల్లించి రూ.11.50 లక్షల నకిలీ కరెన్సీని తీసుకువచ్చాడు. తనకు తెలిసిన నల్గొండ జిల్లా, దొమపల్లె, పారపల్లిగూడెంకు చెందిన మామిళ్ల జానయ్య(34)రంగారెడ్డి జిల్లా, మంచాల్ మండలం, లోయపల్లి గ్రామానికి చెందిన బిలకంటి భరత్‌కుమార్(36), మహబూబ్‌నగర్ జిల్లా, చిన్నచింతకుంట మండలం, ముచ్చింతల గ్రామమానికి చెందిన జెల్లా వెంకటేష్(31) రంగారెడ్డి, మహమ్మదాబాద్‌కు చెందిన డొంకని సత్యనారాయణ(40), మహబూబ్‌నగర్ జిల్లా, తొర్రూర్ మండలం, వెంకటపురం గ్రామానికి చెందిన గుండాల వెంకటేష్‌లకు నకిలీ కరెన్సీ గురించి వివరించాడు. మార్కెట్ నకిలీ నోట్లను మార్చుకుని అందరూ కలిసి 1:4 నిష్పత్తిలో ఇతరులకు ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. దీంతో పాటు నకిలీ బంగారు బిస్కెట్లను అవసరమైన వారికి నిజమైనవి మోసం చేసి విక్రయించడానికి కుట్ర చేశారు. జానయ్య అమాయకులను తీసుకువచ్చి మాణిక్యరెడ్డికి పరిచయం చేస్తాడు. వారి వద్ద నుంచి రూ.లక్ష ఒరిజినల్ కరెన్సీ తీసుకుని రూ.4 లక్షలు నకిలీ కరెన్సీ ఇచ్చేవారు. ఇలా మణిక్యరెడ్డి ఒరిజినల్ కరెన్సీని తీసుకొని తన అనుచరులను నకిలీ నోట్లను పంపిస్తాడు. ఈ నెల 11న సురేష్‌భాయ్ మణిక్యరెడ్డికి ఫోన్ చేసి విశాఖపట్నంలోని కంచర్లపాలెం నివాసి శివశంకర్‌కు ఫోన్ ద్వారా పరిచయం చేసి తనకు నకిలీ కరెన్సీ అవసరమని వివరించాడు. గురువారం శివశంకర్ రూ. 4 లక్షల ఒరిజినల్ డబ్బులతో హైదరాబాద్‌కు వచ్చాడు. చింతలకుంట చెక్‌పోస్ట్ సమీపంలోని మెక్‌డొనాల్డ్స్ ఎదురుగా ఉన్న మణిక్యరెడ్డి అతని అనుచరులతో మాట్లాడుతుండగా విశ్వసనీయ సమాచారం మేరకు ఎల్‌బీనగర్ పోలీసులు 7 మంది అరెస్టు చేసి రూ.11. 50 లక్షల నకిలీ నోట్లు, రూ. 4 లక్షల అసలు నోట్లు, 10 నకిలీ బంగారు బిస్కెట్లు, 7 సెల్‌ఫోన్లు, కారు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. మణిక్యరెడ్డిపై నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్లలో కేసులు ఉన్నాయి.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

వనస్థలిపురం: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం లాంటిదని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. వనస్థలిపురంకు చెందిన భవిరిశెట్టి జ్యోతికి సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ. 60 వేల చెక్కును గురువారం జ్యోతి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కుట్ల నరసింహా యాదవ్, నరేష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చీరల పంపిణీ

దిల్‌సుఖ్‌నగర్: కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉపేందర్ రెడ్డి జన్మదినం సందర్భంగా గురువారం ఆర్‌కేపురం వాసవికాలనీలో జీహెచ్‌ఎంసీ కార్మికులు, వివిధ మహిళ సంఘాల వారికి చీరలు, పండ్లు పంపిణీ చేశారు. మహేశ్వరం నియోజకవర్గం సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి ఉపేందర్‌రెడ్డిని సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

భారీగా చింతపండు దిగుమతి

చాదర్‌ఘాట్: వేసవి సీజన్ వచ్చిందంటే మలక్‌పేట వ్యవసాయ మార్కెట్ ఉల్లిగడ్డలు, మిర్చి, చింతపండు దిగుమతులతో కళకళలాడుతుంది. గురువారం మలక్‌పేటలో చింతపండు దిగుమతులు భారీగా వచ్చాయి. గత ఏడాదితో పోల్చితే ఈసారి క్వింటాల్‌కు రూ.1300 నుంచి రూ. 2 వేల వరకు పెరిగినట్లు వ్యాపారులు తెలిపారు. వివిధ జిల్లాల నుంచి 2284 బస్తాలు దిగుమతి అయ్యాయని మొదటి రకం చింతపండు (వెడల్పు) క్వింటాల్‌కు రూ.34000 పలకగా రెండో రకం రూ. 11000, మూడో రకం (నారా సాగుతది) రూ. 7000 ధరలు ఉన్నాయని మార్కెట్ అధికారులు తెలిపారు.

మహిళ అదృశ్యం



జ్యోతి

నాగోలు: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..నాగోలు సాయినగర్ కాలనీ చెందిన నామని జ్యోతి(48), బుధవారం ఇంట్లో నుండి బయటకు వెళ్లి రాత్రైనా రాలేదు. కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా స్విచ్చాఫ్ వచ్చింది. బంధువులు, స్నేహితులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పోస్టర్ ఆవిష్కరణ

మన్సూరాబాద్: పద్మావతి గోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ 9వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 21 నుంచి 27 వరకు నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ చైర్మన్ చీర్క నర్సిరెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం కార్యదర్శి మార్గం రాజేష్ పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈ నెల 25న సాయంత్రం 7 గంటలకు వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవ, 27న 108 కలశాలతో స్వామికి అభిషేకం, చక్రస్నానంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రారెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, కిరణ్‌కుమార్, రమణారెడ్డి, సత్యనారాయణ, కిషన్‌రెడ్డి,బాల్‌రాజ్, మారాల మోహన్‌రెడ్డి, రమాదేవి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు చేయూత



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు అసౌకర్యానికి గురి కాకూడదని దాతల సహకారంతో వసతులు కల్పిస్తున్నానని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. మన్సూరాబాద్ చౌరస్తా సమీపంలోని ప్రభుత్వ పాఠశాల పాఠశాల ప్రహరీ నిర్మాణ పనులను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. పాఠశాల ప్రహరీ కూలిపోయిందని జిల్లా, మండల విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసిన స్పందించలేదని, దీంతో తానే రూ.50వేలతో ప్రహరీ నిర్మాణం చేపడుతున్నానన్నారు. దాతల సహకారంతో రూ.2లక్షలతో నూతనంగా మూత్రశాలలు చేపడుతున్నామని వివరించారు. అదేవిధంగా ప్రధాన గేటు ప్రధాన రహదారిపై ఉండటంతో వాహనాల రద్దీతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని గేటు మరో పక్కన ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. అరుణ్‌తేజ్ అనే వ్యక్తి రూ.10 లక్షలతో పాఠశాలల భవనాలకు రంగులు వేయిస్తానని హామీ ఇచ్చారని కార్పొరేటర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హరీష్‌రెడ్డి, నాంపల్లి శంకరయ్య, ఉపేందర్‌రెడ్డి, ఎంజాల జగన్, పాతూరి శ్రీధర్‌గౌడ్, సిద్దు పాల్గొన్నారు.

మాంగళ్యలో శారీ డ్రాపింగ్



మన్సూరాబాద్: గణేష్‌నగర్‌కాలనీలోని మాంగళ్య షాపింగ్‌మాల్‌లో గురువారం నిర్వహించిన శారీ డ్రాపింగ్ కార్యక్రమాన్ని చైర్మన్ కాసం నమశ్శివాయ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చీర కట్టులోనే స్త్రీ అందం ఉంటుందన్నారు. చెన్నై నగరానికి చెందిన ప్రముఖ శారీ డ్రాపర్ కవిత ఆధ్వర్యంలో కార్యక్రమం ప్రప్రథంగా నగరంలోని మాంగళ్య షాపింగ్‌మాల్‌లో నిర్వహించినట్లు వివరించారు. హైదరాబాద్ నగరానికి చెందిన ఫ్యాషన్ డిజైనర్స్, బ్యూటీ పార్లర్ ప్రముఖులు హాజరై ఆసక్తిగా తిలకించి, మాంగళ్య యాజమాన్యాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరక్టర్స్ కాసం శివ, పుల్లూరు అరుణ్, తోనూపునూరి అరుణ్ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురంలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దేవలయంలో ఉదయం గణపతి పూజ, పుణ్యహావాచనం, దీక్షా, వస్త్రధారణ, రక్షాబంధనం, మూల విరాట్‌లకు క్షీరాభిషేకం, మండపారాధన, అగ్నిప్రతిష్టాపన తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నెల 17 వరకు కొనసాగుతాయని దేవాలయ కార్య నిర్వహణాధికారి ఉమారాణి తెలిపారు.

ముగిసిన వార్షిక బ్రహ్మోత్సవాలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్ పరిధి డిఫెన్స్‌కాలనీలోని హరిహరక్షేత్ర అయ్యప్ప దేవాలయం వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారంతో ముగిశాయి. మూడవరోజు ఉదయం గణపతిపూజ, స్వస్తి పుణ్యహావచనం, ప్రధాన దేవాలయ దేవతామూర్తులకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ వ్యవస్థాపక చైర్మన్ వంగా మధుసూదన్‌రెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వంగా చంద్రారెడ్డి, సందీప్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, రవీందర్ రెడ్డి, విఘ్నేశ్వర్‌రెడ్డి, అంజయ్యగుప్తా, సూర్యప్రకాశ్ గుప్తా, మల్లికార్జున్‌గుప్తా, కేశవ్‌రెడ్డి, చీర సత్యనారాయణ, ఆకుల భిక్షపతిగౌడ్ పాల్గొన్నారు.

హోలీ వేడుకల్లో సహజ రంగులే వాడాలి

హుడాకాంప్లెక్స్: హోలీ వేడుకల్లో ప్రతి ఒక్కరూ సహజ సిద్ధమైన రంగులనే వాడాలని సరూర్‌నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పారుపల్లి అనితాదయాకర్‌రెడ్డి సూచించారు. గురువారం సరూర్‌నగర్‌లో మహిళా అవేర్‌నెస్ రిసోర్స్ సొసైటీ (మార్స్) ఆధ్వర్యంలో హోలీ పండుగ సందర్భంగా చేపట్టిన సహజ సిద్ధమైన రంగుల పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులు, మహిళలకు రంగులను అందజేశారు. పండుగ పేద ప్రజల జీవితాల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాలని ఆకాంక్షించారు. ప్రతీ ఒక్కరికి సమస్యలు, ఇబ్బందులు ఉంటాయని, వాటి నుంచి దూరం కావడానికి ఇలాంటి పండుగలు చేసుకుంటూ జీవితాలను అందంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు.